
## పెద్దల సబ్బాతుబడి పాఠములు

# కొరింథీయులకు వ్రాసిన
# 1, 2 పత్రికలు



## మూడవ త్రిమాసం

జూలై, ఆగష్టు, సెప్టెంబరు - 2026

గ్రంథకర్త

**ఏడ్‌నిల్‌టిన్ టేవర్సుడి అగుయర్**

అనువాదం

**చింతా ప్రకాష్**

# విషయ సూచిక

1. కొరింథులో పౌలు యొక్క సువార్త పరిచర్య .............................. జూన్ 27-జూలై 3

2. సిలువను గూర్చిన సువార్త ................................................................ జూలై 4-10

3. క్రీస్తునందు ఐక్యత ........................................................................ జూలై 11-17

4. క్రైస్తవ సంఘములో పాపము ......................................................... జూలై 18-24

5. సమస్తమును దేవుని మహిమ కొరకు ................................................ జూలై 25-31

6. ఆత్మీయ వరములు ........................................................................ ఆగష్టు 1-7

7. ప్రేమ యొక్క చిత్రము ................................................................ ఆగష్టు 8-14

8. క్రీస్తు యొక్క పునరుత్థానములో ఉన్న శక్తి ................................................. ఆగష్టు 15-21

9. ప్రేమ యొక్క నడిపింపులో సువార్త పరిచర్య ............................ ఆగష్టు 22-28

10. విశ్వసనీయమైన క్రైస్తవ పరిచర్య .............................. ఆగష్టు 29-సెప్టెంబరు 4

11. గృహ నిర్వాహకత్వము మరియు సువార్త సేవ .................సెప్టెంబరు 5-11

12. అబద్ధ బోధకులతో వ్యవహరించుట .................................. సెప్టెంబరు 12-18

13. కృప, ప్రేమ మరియు సహవాసము .......................................సెప్టెంబరు 19-25

సంపాదక వర్గము

| | | |
|---|---|---|
| సంపాదకుడు | : | క్లిఫర్డు ఆర్.గోల్డు స్టెయిన్ |
| సహాయ సంపాదకుడు | : | సొరయ స్కిడవలర్ |
| సహ సంపాదకుడు | : | షారోన్ థామస్ క్రూస్ |
| ప్రచురణకర్త | : | లియో అలెగ్జాండర్ గ్రీవ్ |
| కళ మరియు కూర్పు | : | లార్స్ జెస్టినన్ |
| పసిఫిక్ ప్రెస్ కోఆర్డినేటర్ | : | మిగుఎల్‌వాల్డినియా |
| ఎలెన్ జి వైట్ ఎస్టేట్ | : | డ్వెయిన్ ఎస్ మాండ్ |


పెద్దల సబ్బాతుబడి బైబిలు అధ్యయన దర్శిని సెవెంతు-డె ఎడ్వెంటిస్టు జనరల్ కాన్ఫరెన్సు వారి ఆధ్వర్యమున తయారు చేయబడింది. ప్రపంచ వ్యాప్తంగా నున్న సబ్బాతుబడి మాన్యుస్క్రిప్ట్ ఇవాల్యుయేషన్ కమిటీ సభ్యులు కన్‌సల్టింగు సంపాదకులుగా వ్యవహరిస్తారు. అందువలన గ్రంథకర్త ఉద్దేశాలు, తలంపులు పూర్తిగా అధ్యయానికి రావు.

సులభంగా అవగాహన కొరకు సిద్ధపర్చబడిన ఈ పెద్దల సబ్బాతుబడి పాఠములు త్రీ ఏంజిల్స్ డెఫ్ మినిస్ట్రీస్, పోస్టుబాక్సు 1946, గ్రీన్‌బెల్ట్, ఎం.డి.20768 వారి సహకారముతో సిద్ధపర్చబడినవి.

సంపాదక కార్యాలయము

**12501 ఓల్డ్ కొలంబియా పైక్**

**సిల్వర్ స్ప్రింగ్, మేరీలాండు-2094**

వెబ్‌సైట్: http:./www.absg.adventist.org

సెవెంత్-డె ఎడ్వెంటిస్టు తెలుగు సంఘాలకు వారి యాజమాన్యం తరఫున పంపిణీ నిమిత్తం ఈస్టు సెంట్రల్ ఇండియా యూనియన్ ఆఫ్ యస్.డి.ఎ. హైదరాబాద్, సబ్బాతుబడి శాఖ డైరెక్టర్ **పాస్టరు మేత్యు మందపల్లి** గారి ద్వారా ముద్రించబడిన పెద్దల సబ్బాతుబడి పాఠాలు.

ఫోన్ : 040-23200079, 23201832

**డి.టి.పి, ముద్రణ :**

వంశీ గ్రాఫిక్స్ & ప్రింటర్స్, విజయవాడ.

# పరిశుద్ధ సబ్బాతుబడి కార్యక్రమము

**మొత్తము 90 నిమిషాల కార్యక్రమము ఉ॥ 9.30 నుండి 11 గం॥ల వరకు**

10 నిమిషాలు ప్రార్థన చేసి, 4 లేక 5 కీర్తనలు పాడించవలెను

| సమయము | కార్యక్రమము | సూచనలు | పాల్గొనే వారి పేరు |
|---|---|---|---|
| 2 నిమిషాలు | మౌన ప్రార్థన | | వేదిక మీద యున్నవారు |
| 3 నిమిషాలు | ఆహ్వానము | (ఆహ్వానించువారి పేరు) | ........................... |
| 3 నిమిషాలు | ప్రారంభ కీర్తన | (నెంబరు, పాట పేరు) | ........................... |
| 2 నిమిషాలు | వేద పఠనము | (చదువు వారి పేరు) | ........................... |
| 2 నిమిషాలు | ప్రారంభ ప్రార్థన | (చేయువారి పేరు) | ........................... |
| 15 నిమిషాలు | సాక్ష్యం, నేచర్ టాక్ | (చెప్పవారి పేరు) | ........................... |
| 3 నిమిషాలు | ప్రత్యేక కీర్తన | (పాడువారి పేరు) | ........................... |
| 10 నిమిషాలు | మిషన్ పొలపు వార్తలు | (చదువువారి పేరు) | ........................... |
| 3 నిమిషాలు | ప్రత్యేక పాట | (పాడువారి పేరు) | ........................... |
| 30 నిమిషాలు | సబ్బాతుబడి పాఠము | (చెప్పవారి పేరు) | ........................... |
| 3 నిమిషాలు | సబ్బాతుబడి కానుకలు, కీర్తన | | ........................... |
| 2 నిమిషాలు | కానుకల ప్రార్థన | (చేయువారి పేరు) | ........................... |
| 3 నిమిషాలు | ముగింపు కీర్తన, ప్రార్థన | (చేయువారి పేరు) | ........................... |

**సూచనలు :**

1. సభ్యులందరూ వారమంత సబ్బాతుబడి పాఠమును చదివి, అర్థము కాని విషయములను అడిగి తెలుసుకొనవలెను.
2. హాజరు తీసుకొని, ప్రార్థనతో ప్రారంభించి, క్లుప్తముగా అర్థగంటలో పాఠమును బోధించి, ప్రార్థనతో ముగించవలెను.
3. పై కార్యక్రమమును సబ్బాతుబడి నాయకులు నడిపించవలెను.
4. సబ్బాతుబడి కానుకలను సబ్బాతుబడి ట్రెజరర్ లెక్కించి, క్రింద వ్రాయవలెను.

| | | | |
|---|---|---|---|
| తేది : ------------- | మొదటి వారము | రూ॥ | ------------- |
| తేది : ------------- | రెండవ వారము | రూ॥ | ------------- |
| తేది : ------------- | మూడవ వారము | రూ॥ | ------------- |
| తేది : ------------- | నాల్గవ వారము | రూ॥ | ------------- |

ట్రెజరర్ ............................................ పాస్టరు ....................................

# ఉపోద్ఘాతం: "క్రైస్తవ జీవితము మరియు సాక్ష్యము యొక్క సారము"

పత్రికలు లేక ఉత్తరములు వ్రాయడము అనునది పురాతన వ్యవహారమైనందున, అది ఇపుడు వాడుకలో లేనిదని తిరస్కరించుటకు వీలులేదు. నేడు మనము కేవలం వాటిని వ్రాసే విధానమును మార్చుకున్నాము. అవును నేడు కాగితము మీద వ్రాయుటకు బదులు మనము సామాజిక మాధ్యములైన ఇ–మెయిల్స్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ విధానములను ఉపయోగించి మన భావాలను ఆలోచనలను, సమాచారమును ఇతరులతో పంచుకొనుచు మన ప్రాథమిక కర్తవ్యమును నెరవేర్చుకుంటున్నాము.

ప్రజానీకం అసలు ఉత్తరాలను ఎందుకు వ్రాస్తారు? వారు ఇతరులతో ఏదో ఒక విషయాన్ని తెలియపర్చాలనుకుంటున్నారు కాబట్టి ఆ విషయాన్ని ఒక ఉత్తర రూపంలో తెలియపర్చుచున్నారనునది ఆ ప్రశ్నకు జవాబుగా పరిగణించవచ్చు. ఆ కారణమును బట్టి అపొస్తలుడైన పౌలు కూడా పత్రికలు ఆయా జనులకు వ్రాసెను. ముఖాముఖిగా ఎన్నో విషయాలు ఆయా జనులతో పౌలు మాట్లాడాలని ఆశ పడినను అన్ని వేళలా అది ఆయనకు సాధ్యపడనందున పత్రికల ద్వారా ఆ విషయాలను వారికి తెలియపర్చేవాడు.

అందుచేత కొరింథీయులు మొదలైన వారికి పరిశుద్ధ లేఖనాలలోని గంభీర సత్యములను పౌలు, ఆయన వ్రాసిన పత్రికల ద్వారా తెలియపర్చెను. ఉదాహరణకు "నేను యేసుక్రీస్తు అనగా సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరిదేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని" (1కొరింథి 2:2) మరియు "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడైయుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2కొరింథి 8:9) మరియు 1కొరింథి 13లో ప్రేమను గూర్చి ఆయన వ్రాసిన కీర్తనను గూర్చి ఏమనుకొనుచున్నారు?

అదే సమయములో క్రైస్తవ సంఘములో నెలకొనియున్న లైంగికపరమైన దుర్నీతి మరియు చౌకబారు వర్గబేధముల వలన కలుగు కుట్రలలో భాగముగా ప్రత్యర్థుల తప్పులను ఎత్తి చూపుతూ విమర్శించుట వంటి పరిస్థితులలో వున్న కొరింథులోని క్రైస్తవ సభ్యులు పౌలు వ్రాసిన పత్రికలను చదివినప్పుడు గొప్ప కలవరపాటుకు గురయ్యారు. మీ క్రైస్తవ సంఘములో కూడా సవాళ్ళతో కూడిన పరిస్థితులు ఎదురైనప్పుడు వాటిని సమర్థవంతముగా ఎదుర్కొనుటకు సిద్ధముగా ఉండాలి. కొరింథీ సంఘములో ఉన్నటువంటి జటిలమైన సమస్యలు మీ ప్రాంతీయ సంఘములో లేకపోవచ్చును. ఆవిధముగా చూస్తే కొరింథీ సంఘములోని సమస్యలు చాలా తీవ్రమైనవిగా కనబడవచ్చును.

కొరింథి సంఘములో కలవరమునకు గురి చేసే సమస్యలు ఉన్నప్పటికి కొరింథీయులకు వ్రాసిన పత్రికల ద్వారా పౌలు వాటిని ఎదుర్కొనిన విధానము మన గమనములను ఆకర్షించక తప్పదు. ముందుగా కొరింథీలో ఉన్న క్రైస్తవ సంఘ సభ్యులను వారి ప్రవర్తన విషయములో యేసు యొక్క సువార్త వెలుగులో వారు స్వీయ పరీక్ష చేసుకోమని పౌలు వర్తమానమును పైకెత్తి పట్టుకొని వారిలో ఉత్తేజమును కల్పించి ప్రోత్సహించెను. పౌలు వేరొక చోట చెప్పినట్లుగా సువార్త వర్తమానమునకు బదులుగా వేరొక వర్తమానమును ప్రామాణికముగా తీసుకొనకూడదని ఈ సందర్భంగా గ్రహించవలసియున్నదని వారికి తెలియపర్చెను. సువార్త వర్తమానమును కాక వేరొక వర్తమానమును శాప గ్రస్తమైనదిగా భావించాలని పౌలు పేర్కొనెను (గలతీ 1:8,9).

పౌలు జీవించిన కాలములో కొరింథీ పట్టణమునకున్న ఓడ రేవు వలనను, ఓడల నిర్మాణపు పనులవలనను కుమ్మర పని ద్వారా అక్కడ తయారైన పింగాణి వస్తువులు మరియు శిల్పశాస్త్రము వలనను ఆ పట్టణము చాలా పేరుగాంచుటయేగాక, ఐశ్వర్యముతో పాటు బలమైన వ్యాపార కేంద్రముగాను మరియు ఆర్థిక కేంద్రముగాను ప్రసిద్ధిగాంచెను. అయినప్పటికి ఆ పట్టణములో లైంగిక పరమైన దుర్నీతి, మతపరమైన పెద్ద కీచు ధ్వనులతో కూడిన శబ్దాలు మరియు అనేకమైన దేవతలకు ప్రతిష్టించిన క్షేత్రములకు కూడా పేరు మోసినది. వాస్తవానికి కొరింథీలోని అనుదిన జీవితము అక్రమముతో కూడిన ఘోరమైన సంస్కృతి నేపథ్యమును బట్టి ఆ పట్టణములో జీవించుచున్న క్రైస్తవులను ఉద్దేశించి పౌలు చేసిన బోధనలను మరియు ఆయన కనుపరచిన శ్రద్ధ మనము అర్ధము చేసుకొనుటకు సహాయపడును.

ఈ త్రిమాసమంతటిలో పౌలు కొరింథీయులకు వ్రాసిన పత్రికలను అవలోకనము చేయనైయున్నాము. నూతన నిబంధనలోని ఈ రెండు అసాధారణమైన పుస్తకములలో పౌలు బోధించిన సువార్త వర్తమానము "క్రైస్తవ జీవితము మరియు సాక్ష్యము యొక్క సారాంశముగాను" అందించుచున్నాడు. ఈ సారాంశమనే అద్దపు బిళ్ళ లేక కటకము ద్వారా అన్ని విషయాలను పరిశోధించుటకు వీలు కల్పించబడెను. పరలోకమునకు మన జీవితయాత్రలో మనలో ప్రతి ఒక్కరు వ్యక్తిగతముగాను లేక సంఘముగాను అనేకమైన సవాళ్ళను ఎదుర్కొనుచున్నప్పటికి క్రీస్తు కొరకు మన పరిచర్యలో ఎదురయ్యే కలవరపర్చే సమస్యలకు అలనాడు కొరింథీయులకు "సిలువ వేయబడిన క్రీస్తునందు (1కొరింథీ 2:2) లభించిన జవాబులు మనకు కూడా సహాయపడనైయున్నవి.

యేసు త్వరగా వచ్చుచున్నాడు. ఇంతకు ముందెన్నడూ లేనివిధముగా ఈ సమయములో మనము ఎక్కువగా క్రీస్తునందు ఐక్యపర్చబడి మనకివ్వబడిన ఆధ్యాత్మిక వరాలను పరిశుద్ధాత్మ శ్రద్ధతో ఉపయోగించుకునే విధముగా మరియు పునరుత్థానుడైన మన ప్రభువుతో ఒక లోతైన అనుభవములోనికి నడిపింపబడునట్లు మనము బాహాటముగా అందుబాటులో ఉండవలసిన సమయమిది. ఒక యదార్ధమైన క్రైస్తవ పరిచర్యలోను గృహ నిర్వాహకత్వము మరియు సంఘ సేవలోను, అబద్ద బోధకులకు వ్యతిరేకముగా ఆధ్యాత్మిక రంగములోను పాల్గొనుచు మరియు కృప ప్రేమ మరియు సహవాసములో ఎదుగుటకు మనకివ్వబడిన సమయమది. సిలువ యొక్క వర్తమానమునకు విశ్వాసముతో గట్టిగా అంటిపెట్టుకొని పౌలు కొరింథీయులకు ఏమి చేయమని తన పత్రికలలో బోధించెనో వాటి ప్రకారము మనము కూడా చేయుటకు సమయమిది.

**సిలువ యొక్క వర్తమానమునకు విశ్వాసముతో గట్టిగా అంటిపెట్టుకొని పౌలు కొరింథీయులకు ఏమి చేయమని తన పత్రికలలో బోధించెనో వాటి ప్రకారము మనము కూడా చేయుటకు సమయమిది.**

ఎడ్‌నిల్‌టన్ బేవర్నుడి అగు-యల్, పిహెచ్‌డి, ఈయన ప్రస్తుతము 2010 నుండి బ్రెజిల్‌లో ఉన్న చిహియా ఎడ్వంటిస్టు కళాశాల, కచోయిరాలో నూతన నిబంధన వ్యాఖ్యాత ఆచార్యుడుగా పనిచేయుచున్నాడు.

❋✶❋

1వ పాఠం జూన్ 27 - జూలై 3

# కొరింథులో పౌలు యొక్క సువార్త పరిచర్య

## సబ్బాతు మధ్యాహ్నము జూన్ 27

**ఈ వారమునకు చదువ వలసిన వాక్యాలు : 1కొరింథి 1:1; గలతీ 1:1; అపొ.కా. 17:16-34; 1కొరింథి 5:9-11; అపొ.కా. 18:4-10, 2కొరింథి 2:4.**

**కంఠతవచనం: "రాత్రివేళ దర్శనమందు ప్రభువు - నీవు భయపడక మాటలాడుము. మౌనముగా ఉండకుము. నేను నీకు తోడైయున్నాను. నీకు హాని చేయుటకు నీ మీదికి ఎవడును రాడు. ఈ పట్టణములో నాకు బహు జనమున్నదని పౌలుతో చెప్పగా" (అపొ.కా. 18:9,10).**

ఖర్చుల నిమిత్తము డబ్బులు సంపాదించుటకు చెప్పులు కుట్టి అమ్మే వాడినని, అయితే ఆత్మలను రక్షించుట తన నిజమైన పనియని ప్రముఖ ఆంగ్లేయ ఖండాంతర సువార్త సేవకుడైన విల్యంకేరీ చెబుతూ ఉండేవాడు.

అదే రీతిగా తన జీవన భ్రుతి కొరకు పౌలు డేరాలు కుట్టే వృత్తిలో ఉన్నను (అపొ.కా. 8:1-13) క్రీస్తు కొరకు మనుష్యులను సంపాదించే పని తన నిజమైన వృత్తిగా భావించెను.

ఈ వారం మనము కొరింథు పట్టణములో ఉన్న క్రైస్తవ సంఘమునకు పౌలు చేసిన పరిచర్య యొక్క ప్రభావమును సంక్షిప్తముగా తెలుసుకొనబోవుచున్నాము. సుమారు రెండువేల సంవత్సరముల తర్వాత నేడు మన క్రైస్తవ సంఘాలలో చూస్తున్నట్లుగానే కొరింథులోని క్రైస్తవ సంఘము అనేక సమస్యలతో నిండియుండెను. చాలా కాలము నుండి క్రైస్తవ మతమును ఆచరించుచున్న వారిలో ఎవరినైనా ఒకరిని గాని లేక క్రైస్తవ సంఘములో పనిచేయుచున్న వారినిగాని, సమస్యలు లేని క్రైస్తవ సమాజమును మీరు ఎపుడైనా చూసారా? అని ప్రశ్నిస్తే, ఎటువంటి జవాబు వస్తుందో స్పష్టముగా అందరూ ఊహించుకొనవచ్చును.

సిలువను గూర్చిన వర్తమానమును బట్టి (1కొరింథి 2:2) పౌలు కొరింథులో అనేక సవాళ్ళను ఎదుర్కొనెను. నేడు మనము ఎదుర్కొనే సవాళ్ళు కూడా ఈ వర్తమానమునకు విశ్వాసమును చూపించుట వలననే వస్తున్నవి. ఈ వారము మరియు త్రిమాసమంతటిలో 1,2 కొరింథీ యులకు వ్రాసిన పత్రికలోని వర్తమానము మన జీవితాలకు కూడా వర్తించునని కనుగొనబోవుచున్నాము.

-జూలై 4, సబ్బాతు దినమున ఈవారమునకు ఏర్పాటు చేయబడిన పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం జూన్ 28

## దేవుడు పౌలును యేసు యొక్క అపొస్తలుడుగా పిలిచెను

"దేవుని చిత్తమువలన యేసు యొక్క అపొస్తలుడుగా తాను పిలువబడినట్లు" (1కొరింథి 1:1ని 2కొరింథి 1:1తో పోల్చి చూడుడి) పౌలు గుర్తించి కొరింథీయులకు ఆయన వ్రాసిన పత్రికను ఆరంభించెను. యేసుక్రీస్తుతో తనకున్న బాంధవ్యము ఎంత బలముగా ఉన్నదో ఎరిగినవాడై యున్నందున కొన్ని మినహాయింపులతో తాను వ్రాసిన పత్రికలన్నియు ఈవిధముగానే ఆరంభించెను.

**1కొరింథి 1:1 మరియు రోమా 1:1 చదువుడి. పౌలు యొక్క పరిచర్యలో ఏ రెండు అంశాలు నొక్కి చెప్పినట్లు ఈ వాక్యాలు తెలియజేసాయి? (గలతీ 1:1 చూడుడి)**

దేవుని చిత్తము యొక్క నెరవేర్పునకు సూచనగా తనను యేసు యొక్క అపొస్తలుడుగా పిలిచెనని పౌలు సాక్ష్యమిచ్చాడు. అతనికి వచ్చిన పిలుపు మనుష్యుల యొద్ద నుండి కాదు గాని, దేవుని యొద్ద నుండి వచ్చినదని బలముగా నమ్మెను (గలతీ 1:1) యిర్మియాను దేవుడు పిలిచినట్లుగా, పౌలు తన తల్లి గర్భములో ఉన్నపుడే దేవుడు తనను పిలిచెను (యిర్మియా 1:5). దేవుని యొక్క కృపకు సూచనగా ఆ కార్యము సంభవించినది (గలతీ 1:15) అన్యజనుల మధ్య క్రీస్తు యొక్క సువార్త ప్రకటింపబడునట్లు అది జరిగెను.

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన ఎందరికి కనిపించెనో (1కొరింథీ 15:5-7) ఆ జాబితాలో తనను కూడా చేర్చుకున్నట్లు పౌలు 1 కొరింథి 15:8లో పేర్కొనెను. కొన్ని వచనముల తరువాత తాను అనుకొనని రీతిలో హఠాత్తుగా యేసు తనకు ఎదురు పడుట వలన కలిగిన ఫలితమే తాను అపొస్తలుడుగా పిలువబడుటకు కారణమని చెప్పెను (1కొరింథి 15:9-11).

"యేసు యొక్క అపొస్తలుడు" అనే నామము లేక బిరుదులో కొన్ని భావములు ఇమిడియుంటాయి. ప్రాథమికముగా "యేసు పంపించినవాడు" అనే భావమును తెలియజేయుచున్నది. అయితే పౌలు మాత్రము తనను తాను క్రీస్తు యొక్క సేవకుడుగాను (రోమా 1:1; తీతు 1:1; గలతీ 1:10), ఒక బోధకుడుగాను, మరియు ఉపదేశించేవానిగాను పరిచయము చేసుకొనుటకు ఈ పదసముదాయమును ఉపయోగించుకొనెను (1తిమోతి 2:7; 2తిమోతి 1:11). పౌలు ఎప్పుడు బోధించినను ఆ వర్తమానములో క్రీస్తును గూర్చిన సాక్ష్యము లేక రుజువు ఉండెడిది. క్లుప్తముగా పౌలు యేసు యొక్క అపొస్తలుడైయుండెను.

పౌలు యొక్క అపొస్తలత్వములో యేసు కేంద్రమైయుండుటయే కాకుండా పౌలు యొక్క జీవితములో కూడా క్రీస్తే కేంద్ర బిందువైయుండెను. పౌలు తలంపులు మరియు భావోద్వేగములో యేసు సన్నిధితో నిండుకొని యుండెడివి. ఈ వాస్తమునకు రుజువుగా 1కొరింథీ పత్రిక ఆరంభములోను మరియు కృతజ్ఞతాస్తుతులు చెల్లించే విభాగములోను

అనేకమారులు యేసును గూర్చి ప్రస్తావించెను (తొమ్మిది వచనాలలో 9సార్లు), పౌలు యేసును అమితముగా ప్రేమించుట వలన యేసును గూర్చి ఆలోచించకుండా ఉండలేకపోయేవాడు. ఆయన సంరక్షణ క్రింద ఉన్నవారి జీవితాలు క్రీస్తు కేంద్రబిందువులుగా ఉండాలనే ఆశతో పౌలు యేసును గూర్చి బోధించేవాడు. వీరిని ప్రభువు ఏ పని నిమిత్తము పిలిచినా వారిని విశ్వాసముతో యేసును వెంబడించిన వారని పిలువబడిరి. పౌలు మాత్రము అపొస్తలుడుగా పిలువబడెను.

**పౌలు అపొస్తలుడుగా పిలువబడెను. నీకు వచ్చిన పిలుపు ఏమిటి? ఆ పనికి నీవు పిలువబడితివని ఎట్లు తెలుసుకొందువు? నిన్ను ఏ పనికి పిలువలేదని అనుకున్నట్లయితే, ఇపుడే నేరుగా యేసు నొద్దకు వెళ్ళి, నీవేమి చేయాలని ఆయన కోరుచున్నాడో నీకు బయలుపర్చమని అడుగుము.**

సోమవారం — జూన్ 29

## ఏథెన్సు నుండి కొరింథునకు

**అపొ.కా. 17:16-34 చదువుడి. కొరింథుకు వెళ్ళకపూర్వము పౌలు ఎక్కడ ఉన్నాడు? అక్కడ ఏమి చేయుచుండెను?**

పౌలు కొరింథుకు వెళ్ళకముందు ఏథెన్సు ప్రజలకు యేసును గూర్చియు ఆయన పునరుత్థానమును గూర్చియు బోధించెనని అపొ.కా. 17:16-34 వివరిస్తుంది. నిజానికి ఆ సమయములో ఏథెన్సును దర్శించాలనే ప్రణాళిక పౌలుకు లేకపోయినను బెరయలో కొంత వ్యతిరేకతను ఎదుర్కొనుటవలన కొందరు స్నేహితుల సహకారముతో అక్కడకు వెళ్ళెను. (అపొ.కా. 17:13-15).

పౌలుతో ఏథెన్సుకు వెళ్ళిన వారిలో కొందరు బెరియాకు తిరిగి వెళ్ళి తిమోతియు మరియు సీలయు పౌలు యొద్దకు వెళ్ళి ఆయనతో కలిసి పనిచేయవలెనని ఆజ్ఞ పొందినవారై వారి యొద్దకు వెళ్ళిరి (అపొ.కా. 17:15) వారిరువురు పౌలు యొద్దకు వచ్చే వరకు ఆయన ఏమి చేయుచున్నాడో అనే విషయాలను అపొ.కా. 17:16-34 వివరించుచున్నది. సమాజ మందిరములలోను, సంతవీధులలోను మరియు అరియొపగు అను సభలోను యేసును గూర్చి మాట్లాడకుండా మౌనముగా ఉండలేకపోవుట వలన అతనికి ఎదురైన ప్రతి అవకాశమును వినియోగించుకొనెను.

**అపొ.కా. 18:1-11 చదువుడు. పౌలు కొరింథుకు వచ్చిన తరువాత ఆ పట్టణములో జీవించినంతకాలము ఏమి చేసెను?**

పౌలు తన రెండవ సువార్త యాత్ర సమయములో కొరింథుకు వెళ్ళెను. అక్కడ ఆయన ఒకటిన్నర సంవత్సరము కాలము పాటు నివసించినట్లు లూకా మనకు తెలియజేయుచున్నాడు.

ఎప్పటివలెనె పౌలు తన సువార్త పరిచర్యను సమాజమందిరములోనే ఆరంభించెను (అపొ.కా. 18:4-6), తన వాడుక ప్రకారము పౌలు ఆ విధముగా చేసెనని అపొ.కా. 17:1,2 పేర్కొనుచున్నది. ముందుగా యూదులకు సువార్తను ప్రకటించాలనే వ్యూహమును పౌలు అనుసరించెను. (రోమా 1:16, అపొ.కా. 13:46) యేసు తన శిష్యులకు ఆజ్ఞాపించిన విషయమునే పౌలు అనుసరించెను (అపొ.కా. 1:8 చూడుడి).

చివరికి సీలయు, తిమోతియు పౌలును కొరింథులో కలుసుకున్నపుడు "వాక్యమును బోధించుటయందు ఆతృతగలవాడై యేసే క్రీస్తని యూదులకు దృఢముగా సాక్ష్యమిచ్చుచుండెను." (అపొ.కా. 18:5). పౌలు కొరింథులో నివసించినంతకాలము "దేవుని వాక్యమును, బోధించుటయందు విస్తారమైన పని కలిగి యుండెను" (అపొ.కా. 18:11) ఈ సందర్భములోనే ప్రసిద్ధి గాంచిన తన మాటలను పలికెను "నేను, యేసుక్రీస్తును అనగా సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప, మరి దేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని" (1కొరింథి 2:2).

**ఏథెన్సులోను కొరింథులోను పౌలు యొక్క సువార్త పరిచర్య నుండి మనము ఏమి నేర్చుకొనగలము? మన పట్టణములలోను, సమాజములలోను సువార్తను ప్రకటించేటపుడు ఎందువలన సవాళ్ళను ఎదుర్కొనవలసి వస్తుంది? ఇట్టి దుర్లభమైన స్థలములలో విజయవంతముగా సువార్తను ఎట్లా ప్రకటించగలము? మంచి ఫలితాలను రాబట్టే విధముగా సువార్త పరిచర్య చేయుటకు, పౌలు చేసిన సువార్త పరిచర్య నుండి నేర్చుకొనగలిగే వ్యూహములు ఏమిటి?**

**మంగళవారం** **జూన్ 30**

## కొరింథు పట్టణము

**అపొ.కా. 18:1-3; 1కొరింథి 5:9-11; 1కొరింథి 8:4 చదువుడి. కొరింథు యొక్క ఆర్థిక వ్యవస్థ, సత్ప్రవర్తన, మతపరమైన విధానం విషయమై ఏవిధంగా ఊహించాలి?**

పురాతన ప్రపంచములో కొరింథు పట్టణము ప్రాముఖ్యమైన కేంద్రముగా గుర్తింపబడెను. వ్యాపారరీత్యా అది చాలా వర్ధిల్లినది. క్రీ.పూ. 146లో రోమీయులు ఆ పట్టణమును కూల్చివేసిరి. అయితే క్రీ.పూ. 44లో కైసరు ఔగుస్తు అధికారము క్రింద ఆ పట్టణమును అన్యదేశములో ఏర్పరచుకొనిన రోమీయుల గ్రామముగా తిరిగి నిర్మింపబడెను. ఆవిధముగా తిరిగి నిర్మింపబడిన ఆ కొరింథు పట్టణమును గూర్చే నూతన నిబంధన గ్రంథములో పేర్కొనబడినది. పౌలు జీవించిన కాలములో ఏథెన్సు పట్టణమును ఒక విరోధులకు చెందిన పట్టణముగా కొరింథు పట్టణము పరిగణించేది. ఎన్నో విషయాలలో

ఏథెన్సు పట్టణము కన్నా ఎంతో ముందంజలో కొరింథు పట్టణము ఉండెడిది. కొరింథుకు రెండు ప్రధానమైన ఓడ రేవులు ఉండెడివి. వాటి ద్వారా సరుకు విక్రయాలు జరుగుటయేకాక, ఆ ప్రాంతము నుండి ఇతర దూర ప్రాంతములకు రవాణా చేయబడుట ద్వారా వ్యాపారాభివృద్ధికి తోడ్పడినది.

కొరింథు పట్టణానికి ఉన్న ప్రాముఖ్యతను బట్టి మరియు భౌగోళిక స్థానమును బట్టి పౌలు ఆ పట్టణములో సువార్త పరిచర్య చేయుటకు ఎంచుకొనెను. “సువార్తను ప్రకటించుటకు దానిని వ్యాప్తి చేయుటకు గొప్ప అవకాశమున్నట్లు కనుగొనబడెను. ఒక్కసారి కొరింథులో సువార్తను స్థాపించిన యెడల అచ్చట నుండి అప్పటి ప్రపంచ నలుమూలలకు సులభంగా సువార్తను వ్యాప్తి చేసే అవకాశములు మెండుగా ఉండెను – ఎలెన్ జి వైట్, పౌలు జీవితములో నుండి నమూనాలు పుట 99.

వీటన్నింటికి తోడుగా అనగా, కొరింథులో జరుగుచున్న వ్యాపారాభివృద్ధిని బట్టి పౌలు తానే డేరాలను తయారు చేసి వాటిని అమ్ముట ద్వారా వచ్చే రాబడితో ఆ పట్టణములో సువార్తను ప్రచురించుటకు అవకాశాలు మెండుగా ఉండెను (అపొ.కా. 18:2,3) మనందరికి తెలిసిన విధముగా, పెద్ద పెద్ద పట్టణాలలో, ఆర్థికముగా వర్ధిల్లుచున్న ప్రాంతాలలో సువార్త పరిచర్యకు అనేక సవాళ్ళు ఎదురవుతాయి. కొరింథు పట్టణములో దేవతలనబడినవారును ప్రభువులనబడినవారును అనేకులున్నారు. బహుత్వ వాదమునకు ప్రసిద్ధి చెందినది (1కొరింథి 8:5) అపొల్లో, ఎథీనా మరియు అఫ్రోదైతు వంటి దేవతలకు అనేకమైన గుడులు గోపురాలు వున్నవి. వీటితో పాటు ఐగుప్తుకు చెందిన సెరాపిస్ మరియు ఐసిస్ వంటి దేవతలకు కూడా ఆలయములున్నవి.

ఇటువంటి మతపరమైన కలవరముతో పాటు కొరింథు పట్టణము లైంగికపరమైన విచ్చలవిడితనమునకు పేరు మోసినది. స్ట్రాబో అనే గ్రీకు చరిత్రకారుడు పేర్కొనినట్లు కొరింథులో ఉన్న అఫ్రో దైతు దేవతకు అంకితము చేయబడిన దేవాలయములో వెయ్యిమంది వేశ్యలుండేవారని ఆ వేశ్యావృత్తి పవిత్రమైనదిగా భావించేవారని తెలియపర్చడమైనది. ఈ విషయములో అనేకమంది విద్యావేత్తలు అది కేవలం ఏథెన్సు పట్టణస్తులు కొరింథుకు వ్యతిరేకముగా చేసిన చెడు ప్రచారమని కొట్టి వేసినను వేరేచోట కొరింథులో విగ్రహారాధన మరియు దుర్నీతి పోకిరితనము ఆ పట్టణ ప్రజల అనుదిన జీవితములో భాగముగా ఉన్నట్లు కొరింథీయులకు వ్రాసిన 1, 2 పత్రికలలో కనిపిస్తుంది.

**కొరింథులో పౌలు సువార్త పరిచర్యలో విగ్రహారాధన, విచ్చలవిడితనము వలన అనేక సమస్యలు ఎదుర్కొన్నాడు. నేటి సమాజములో ఉన్న సంస్కృతి వలన సువార్త ప్రకటించుట ఎందువలన కష్టంగా ఉంది? నిజమైన సవాళ్ళు ఏమిటి? వాటి నెలా అధిగమించగలము? ఆనాటి కొరింథుకు నేటి పట్టణాలకు మధ్య తేడాలేమిటి?**

**బుధవారం** **జూలై 1**

## "ఈ పట్టణములో అనేకులు ఉన్నారు"

**అ.కా. 18:4-8 చదువుడి. పౌలు సువార్త వలన కలిగిన ఫలితములేమిటి?**

కొరింథులోని యూదులకు పౌలు సువార్తను ప్రకటించగా ఆయన ఆశించినంత ఫలితాలు రాలేదు. ఆయన కొంత విరోధమును మరియు ద్వేషమును ఎదుర్కొన్నాడు. "వారు ఎదురాడి దూషించిరి" (అపొ.కా. 18:6) అని బైబిలు చెప్పుచున్నది. గ్రీకు పదమైన "బ్లాస్ఫిమియో" అనునది క్రియాపదము. మానవుని దూషించుటకు ఉపయోగపడుటయే ఆ పదము యొక్క లక్ష్యము. ఇంకొక మాటలో చెప్పాలంటే, కొరింథులో పౌలు చేయుచున్న సువార్త పరిచర్యను బట్టి అతనిని అగౌరపర్చాలని ఆచటి ప్రజల యొక్క ఉద్దేశము. అయితే కొరింథులోని సమాజ మందిరములో పౌలు చేసిన బోధ నిరర్థకము కాలేదు. దీనిని బట్టి ఈ సువార్త పరిచర్య వెనుక ఉన్నది దేవుడే అని రుజువైనది. "నా నోట నుండి వచ్చు మాట నిష్ఫలముగా నా యొద్దకు తిరిగి రాదు" (యెషయా 55:11) సమాజ మందిరము యొక్క అధికారియైన క్రిస్పు మరియు అతని కుటుంబ సభ్యులందరు యేసును మెస్సీయగా అంగీకరించి బాప్తిస్మము తీసుకుంటారని యూదులు ఊహించలేదు. (అపొ.కా. 18:8) అంతమాత్రమే కాకుండా అనేకమంది కొరింథీయులు పౌలు బోధలను విని, విశ్వసించి బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 18:8) క్రిస్పు యొక్క పలుకుబడి కూడా వారికి సహాయపడెను.

**అపొ.కా. 18:9,10 చదువుడి. కొరింథులో ఎదురైన సవాళ్ళను గూర్చి పౌలుకు కలిగిన భావావేశము నుండి మనము ఏమి ఊహించుకొనవచ్చును? దేవుడు తన దాసుని ఏవిధముగా ప్రోత్సహించెను?**

పౌలు సమాజమందిరమును విడిచి వెళ్ళిన వెంటనే తనకు కలిగిన అనుభవము ద్వారా ప్రోత్సహమును పొందెను. రాత్రి సమయములో కలిగిన దర్శనములో క్రీస్తు తానే స్వయముగా పౌలుకు ప్రత్యక్షమై యెషయా 41:10లో మాటల ద్వారా అనగా "భయపడకుము నేను నీకు తోడైయున్నాను" అని ప్రోత్సహించెను. వాస్తవానికి ఆ సమయములో పౌలు "బలహీనతతోను భయముతోను ఎంతో వణుకుతోను మీ యొద్దనుంటిని" (1కొరింథి 2:3) అని ఒప్పుకొనుచున్నాడు. విపరీతమైన వ్యతిరేకత వలన బెరియా నుండి ఏథెన్సుకు వెళ్ళిపోవాలని నిశ్చయించుకొనెను. అక్కడ ఎదురైన వ్యతిరేకతను బట్టి కొరింథును విడిచి వెళ్ళిపోవాలనుకున్నాడు. అయితే ఈసారి ఆవిధముగా సంభవించలేదు. అందుకు యేసు ఈ పట్టణములో నాకు బహు జనమున్నదని పౌలుతో చెప్పెను (అపొ.కా. 18:10). ఆ ప్రజలకు రక్షణ సువార్తను అందించుటకు యేసుకు పౌలు ఒక ఉపకరణముగా ఉండెను.

**యెషయా 41:10 చదువుడి. ఈ వాక్యములో దేవుడు నీకు అనుగ్రహించుచున్న ఆశ్చర్యకరమైన వాగ్దానములు ఏమిటి? నీ జీవితములో ఇప్పుడే అది నీకు ఎటువంటి నిరీక్షణను కలుగజేయుచున్నది?**

గురువారం **జూలై 2**

## కొరింథీయులకు పౌలు వ్రాసిన పత్రికలు

**1కొరింథి 1:11-13; 1కొరింథి 4:14; 1కొరింథి 5:11; 1కొరింథి 7:1 మరియు 1కొరింథి14:37,40; 2కొరింథి 1:12; 2కొరింథి 2:9; 2కొరింథి 11:3; 2కొరింథి 13:10 చదువుడి. పౌలు కొరింథీయులకు పత్రికలు ఎందుకు వ్రాసెనో అనే విషయము అర్థము చేసుకొనుటకు ఈ వాక్యాలు ఎట్లు సాయపడును?**

పౌలు కొరింథి మొదటి పత్రిక వ్రాసినపుడు ఆయన ఎఫెసులో నివసిస్తున్నాడు (1కొరింథి 16:5-9) కొరింథులో అన్ని విషయాలు సక్రమముగా లేవనే సమాచారమును క్లోయె కుటుంబ సభ్యులు పౌలు యొద్దకు తీసుకొని వెళ్ళిరి. (1కొరింథి 1:11) క్లోయె యింటివారు తెలియపర్చిన విషయాలను పౌలు పరిశీలించాడు. ముఠా కక్షలు, లైంగిక పరమైన అవినీతి, న్యాయస్థానములలో వాజ్యములు మరియు జారత్వము వంటి ఈ సమస్యలు సమాజములో అధికముగా ఉన్నవి. కొన్ని ప్రశ్నలతో ఒక వినతి పత్రమును కూడ పౌలుకు ఇవ్వబడెను ((1కొరింథి 7:1) వాటన్నిటికి పౌలు ఇచ్చిన సమాధానములను కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలోని 7వ అధ్యాయము నుండి చూడగలము. వారు లేవనెత్తిన ప్రశ్నలలో వివాహము, విడాకులు, బ్రహ్మచర్యం, విగ్రహములకు అర్పించిన ఆహారము, ఆరాధనను నిర్వహించుట, ఆత్మీయ వరములను ఉపయోగించుట, పునరుత్థానము గూర్చి సరియైన అవగాహన లేకపోవుట వంటి అంశములున్నవి. కొరింథులో ఉన్న క్రైస్తవ సంఘము చాలా సమస్యలతో నిండియుండుటయే కాక అపరిపక్వ స్థితిలో ఉన్నది. బహుశ మీ ప్రాంతీయ సంఘములో కూడా అనేక సమస్యలుండి యుండవచ్చును. అయితే కొరింథులో ఉన్న క్రైస్తవ సంఘము మిక్కిలి చెడ్డదిగా ఉండి యుండవచ్చును.

పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక నేటి మన కాలమునకు కూడా పొంతన కలిగియున్నది. కొరింథు సంఘములో ఉన్న సమస్యల వంటివి నేడు కూడా సంఘములలో ఉన్నవనుటలో ఎట్టి సందేహము లేదు. ఈ పత్రిక అనేక విషయాలు వివరిస్తుంది. పౌలు వ్రాసిన పత్రికలన్నింటిలో కన్నా ఈ పత్రిక చాలా గంభీరమైనది. బోధించుటకు వీలైనది. మరియు చాలా శక్తివంతమైనది" -ఎలెన్ జి వైట్, అపొస్తలుల కార్యములు పుట 301.

కొరింథీయులకు పౌలు 3 లేక 4 పత్రికలు వ్రాసి యుండవచ్చు (2కొరింథి 10:9 పోల్చి చూడుడి) మొదటి పత్రిక యొక్క ఆరంభమునకు ముందే ఒక పత్రికను కొరింథీయులకు వ్రాసెను. (1కొరింథి 5:9) అయితే అది ఎక్కడో తప్పిపోయింది. రెండవ పత్రికకు ముందు కూడా కఠినమైన ఉత్తరమును వ్రాసెను (2 కొరింథి 2:3,4,9; 2కొరింథి 7:8) అయితే అది కూడా తప్పిపోయింది. ఆ పత్రిక తప్పిపోవడం కాదు గాని మొదటి పత్రికను గూర్చి పౌలు మాట్లాడుచున్నాడనియు, రెండవ పత్రికలో భాగముగా అది భద్రపర్చబడిందని భావించారు.

కొరింథీయులు చుట్టు ప్రక్కలున్న సంస్కృతికి లోనైనట్లు రెండవ పత్రిక ద్వారా గుర్తించవచ్చు. పోటీ తత్వము, అధికారము మరియు సంపద వంటి విషయాలు నేడు మనకు సవాలు విసిరినట్లే ఆనాడు కూడా వారు అటువంటి విషయాలకు ప్రాధాన్యమిచ్చారు. సువార్త అనే అద్దము ద్వారా క్రీస్తును పరిచయము చేసే సంస్కృతిని సృష్టించాలని పౌలు తలంచెను. నేడు మనము కూడా సువార్త అనే అద్దము ద్వారా అన్ని విషయాలను చూచుట ఎంతైనా అవసరము.

**2కొరింథి 2:4 చదువుడి. ఆ ప్రజలను గూర్చి పౌలు ఎంత జాగ్రత్త వహించెనో ఈ వాక్యము వివరించింది. దీనికి విరుద్ధముగా ఇతరులకొరకు నీ హృదయములో ఎంత ప్రేమ ఉన్నది?**

**శుక్రవారం** **జూలై 3**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్, అపొస్తలులు కార్యములోని కొరింథు పుటలు 243–254.

కొరింథులో సువార్తను ప్రకటించేటపుడు అపొస్తలుడు ఏథెన్సులో అనుసరించిన విధానాలను విడిచి పెట్టి వేరే విధానాలను అనుసరించెను. సుదీర్ఘమైన వాదనలు చర్చలకు చోటివ్వకుండా తాను చూచుకోవాలని ఒక తీర్మానమునకు వచ్చెను. సిలువ వేయబడిన యేసును తప్ప మరి ఏ ఇతర అంశములను గూర్చి కొరింథీయుల మధ్య చర్చించకూడదని నిశ్చయించుకొనెను" –ఎలెన్ జి వైట్, అపొస్తలుల కార్యములు పుట 244.

పౌలు ఆశించినట్లుగ తన పనిలో కొంత విజయమును సాధించెను. అక్కడ అందుబాటులో ఉన్న పరికరాలతో క్రైస్తవ సంఘాన్ని నిర్మించాలనే విషయములో కొంత అనుమానమునకు తావిచ్చెను. కొరింథు పట్టణములోని పరిస్థితులు ప్రశ్నార్ధకముగా ఉ ండుట వలన ఆ పట్టణమును విడిచి వెళ్ళాలనే తలంపును పరిశీలించాడు. ఈ పట్టణములోనికి వెళ్ళి అక్కడ ప్రయాసపడినట్లయితే ఇక్కడ కన్నా మంచి ఫలితాలు ఆ నూతన పట్టణములో దొరుకుననే తలంపుతో ఆ పట్టణమును విడుచుటకు తీర్మానించుకున్నందున ఒక దర్శనములో

పౌలుకు ప్రభువు ప్రత్యక్షమై “నీవు భయపడకు సువార్తను బోధించుము. ఈ పట్టణములో నా ప్రజలు అనేకులున్నారని చెప్పెను. అందుచేత కొరింథులో తన సువార్త పరిచర్యను కొనసాగించవలసిందిగా ప్రభువు ఆజ్ఞాపించుచున్నాడని పౌలు అర్థము చేసుకొని తాను ఇక్కడ విత్తుచున్న వాక్యమనే విత్తనము ద్వారా మంచి ఫలితాలను ప్రభువు అనుగ్రహిస్తాడని గ్రహించి యేసు క్రీస్తు నామములో క్రైస్తవ సంఘమును స్థాపించెను – ఎలెన్ జి వైట్ పౌలు జీవితము నుండి నమూనాలు, పుటలు 106,107.

కొరింథులో పౌలు ఒక సంవత్సరము ఆరు నెలలపాటు సువార్తను ప్రకటించెను. ఆయన పని కేవలం కొరింథు పట్టణాన్ని తన ప్రధాన కేంద్రముగా చేసుకొని అనేక క్రైస్తవ సంఘములను స్థాపించెను. పౌలు స్థాపించిన సంఘములన్నింటిలో ఆయన లేకపోయినను పౌలు వ్రాసిన పత్రికలను దేవుని వాక్యముగా పరిగణించి ఆయా క్రైస్తవ సంఘములలో చదివి వినిపించెడి వారు. –ఎలెన్ జి వైట్, పౌలు యొక్క జీవితము నుండి నమూనాలు పుట 109.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. పౌలు అపొస్తలుడనియు, ఆయనకు దేవుని యొద్దనుండే సువార్త పరిచర్య చేయమనే పిలుపు వచ్చిందని నమ్మాడు. మనము ఎవరమైయున్నాము? దేనికి పిలువబడితిమి అని తెలుసుకొనుట ఎందుకు ప్రాముఖ్యము?
2. కొన్ని క్షణాలపాటు కొరింథులో చేయుచున్న పరిచర్యను ఆపి వేరొక పట్టణమునకు వెళ్ళాలని పౌలు తీర్మానించుకొనెను. ఆవిధంగా తన మనసును మార్చుకొనుటకు కారణమేమి? మనము కూడా సువార్త పరిచర్యను ఒక ప్రాంతములో నిలిపివేయాలనుకున్నపుడు పౌలు దృష్టాంతము ఎట్లు సహాయపడుతుంది?
3. కొరింథులో ఉన్న సభ్యులు వారి చుట్టూ ఉన్న సంస్కృతి ప్రభావమునకు గురి కాబడిరి. ఇట్టి పరిస్థితి నేడు మన మధ్య కూడా ఉన్నది. మనము ఈ లోకంలో ఉంటూ శారీరక కోరికలకు నేత్రాశకు జీవపు డంబమునకు గురికాక ఎట్లు జీవించగలము? (యోహాను 17:11,15; 1యోహాను 2:16) మన చుట్టూ ఉన్న సంస్కృతికి, సంఘ ప్రభావమునకు ఏ ఇతర మార్గాల ద్వారా గురి కాబడుతుంది?

❖❖❖